ప్రజాశక్తి
మంగళవారం 19 మార్చి 2024
8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

'పది' పరీక్షలు ప్రారంభం



- తొలిరోజు ఉమ్మడి కృష్ణాలో 1,881 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అధికారులు

వార్త 6లో



విజయవాడలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

అంతర్మథనం

- బిజెపితో పొత్తుపై టిడిపి శ్రేణుల్లో అయోమయం
- విజయవాడకు నిధులు నిల్
- కేంద్రం షరతులతోనే నీటి మీటర్ల ఏర్పాటు
- పట్టణ సంస్కరణల పేరుతో పన్నుల బాదుడు
- శిలాఫలకాలకే అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-విజయవాడ

ప్రస్తుతం జరగబోయే సాధారణ ఎన్నికల్లో ముందు నుయ్యి...వెనుక గొయ్యి.. అన్నచందంగా టిడిపి పరిస్థితి తయారైంది. పొత్తులో భాగంగా టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఈ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నాయి. విజయవాడ నగరంతో పాటు రాష్ట్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, జగన్ పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్గించేందుకే కేంద్రంలోని బిజెపితో పొత్తు పెట్టుకోవాల్సి వస్తోందని టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ సిఎం చంద్రబాబునాయుడు నుంచి వస్తున్న సమాధానానికి క్షేత్ర స్థాయిలోని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేని పరిస్థితిలో ఉన్నారు. అధికార వైసిపిని ఒంటరిగా ఎదుర్కోలేని పరిస్థితుల్లో టిడిపికి ఈ ఎన్నికలు 'డు ఆర్ డై' అన్నట్లుగా ఉన్నంత మాత్రాన రాష్ట్రంతో పాటు విజయవాడ నగర వ్యాప్తంగా ఏ మాత్రం ప్రభావం చూపని, ఉనికే లేని బిజెపితో వెళ్లడం అంటే కుక్కతోక పట్టుకొని గోదారి ఈదిన చందమేనని పలువురు బాహాటంగానే ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. బిజెపితో కలిసి పోటీ చేసినట్లయితే టిడిపికి లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. అటు రాజకీయంగా, ఇటు ఆర్థికంగా బిజెపి విజయవాడకు ఒరగబెట్టిందేమి లేదని చెబుతున్నారు.

విజయవాడ నగరానికి సంబంధించిన అనేక స్కీమ్స్ నిధుల సమస్యతో మూలనపడ్డాయి. అర్ధాంతరంగా ఆగిపోయిన రూ.461 కోట్ల స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్ కానీ, ఒక్క అడుగు ముందుకు వేయని పలు ఆర్‌యుబిలు, ఆర్ఒబిలు, అలాగే ఈ నగరానికి క్యాపిటల్ పద్దుల కింద విడుదల చేయాల్సిన నిధులు, గ్రాంట్స్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఒక్క పైసా కూడా మంజూరు చేసిన పరిస్థితి లేదు. స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్‌కు సంబంధించి రూ.289 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వేరే (మిగతా 6లో)



ఎసిబి వలలో ఇన్‌ఛార్జి ఎఇ

వెహికల్ డిపో కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు డిమాండ్

ప్రజాశక్తి-విజయవాడ



ఈశ్వర్

విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన వెహికల్ డిపోలో ఇన్‌ఛార్జి ఎఇగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తోట ఈశ్వర్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. వెహికల్ డిపోలో చెత్త తరలింపు వాహనాల కాంట్రాక్టర్ సద్దాం హుస్సేన్ నుంచి ఈశ్వర్ రూ.50 వేలు డిమాండ్ చేశారు. వర్క్ ఆర్డర్‌కు సంబంధించిన అగ్రిమెంట్ ఫైల్ ప్రాసెస్ చేసేందుకు ఈశ్వర్ డబ్బులు డిమాండ్ చేయడంతో హుస్సేన్ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. సోమవారం సద్దాం హుస్సేన్ వద్ద రూ.50 వేలు తీసుకుంటుండగా ఎసిబి డిజి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్‌పి స్నేహిత, విజయవాడ డిసిపి బంగార్రాజు, గుంటూరు డిఎస్‌పి సత్యానందం, సిఐలు నాగరాజు, సత్యనారాయణ, శ్రీనివాసరావు వలపన్ని ఈశ్వర్‌ను పట్టుకున్నారు. విజయవాడ నగరంలోని ఒక సచివాలయంలో ఎమినిటీ సెక్రటరీగా పని చేస్తున్న ఈశ్వర్ గత నాలుగేళ్లకు పైగా వెహికల్ డిపోలో ఇన్‌చార్జి ఎఇగా విధులు నిర్వర్తిస్తున్నారు. చెత్త తరలింపునకు వాహనాల కాంట్రాక్టర్లు, వర్క్ ఆర్డర్ జరగాలంటే తప్పని సరిగా డబ్బులు ఇచ్చుకోవాల్సిందేనని డిమాండ్ చేయడంతో చేసేది లేక సదరు కాంట్రాక్టర్ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో సద్దాం హుస్సేన్ నుంచి డబ్బులు తీసుకుంటున్న ఇన్‌ఛార్జి ఎఇని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి బంగార్రాజు తెలిపారు. వెహికల్ డిపోలో ఎసిబి దాడులతో ఒక్క సారిగా విఎంసిలోని అధికారులు ఉలిక్కిపడ్డారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

- రెండు మాసాల్లో వెయ్యి కేసులు
- రూ.కోటి వరకు జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

డ్రంక్ అండ్ డ్రైవ్ మీద పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడుతున్నారు. విజయవాడ నగరంతో పాటు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా దీనిపై పోలీసులు అలెర్ట్ ప్రకటించారు. ప్రతి రోజూ దీనిపై తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం ప్రమాదాలు మద్యం తాగి వాహనాలు నడపటం వల్లనే సంభవిస్తున్నాయి. గత రెండు మాసాలుగా చేపట్టిన తనిఖీల్లో భారీ సంఖ్యలో కేసులు నమోదు చేయడమే కాకుండా పెద్ద ఎత్తున అపరాధ రుసుం వసూలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా దాదాపు వెయ్యికి పైగా కేసులు నమోదు చేసిన పోలీసులు సుమారు రూ.కోటి వరకు జరిమానా విధించారు. మోటార్ వాహన చట్టం ప్రకారం 185వ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సిఫార్సులను అమలు చేయడంలో భాగంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు ముమ్మరం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో అధికారులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ చర్య తీసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఎన్టీఆర్ జిల్లాలో రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు 20 శాతం పెరిగాయని కమిటీ గమనించింది. రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో చేస్తున్న కసరత్తు మంచి ఫలితాలను ఇస్తోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. కేసులు పెట్టడమే కాకుండా నిందితులను సంబంధిత కోర్టుల ముందు హాజరుపరుస్తున్నారు. న్యాయ మూర్తులు వారికి వారం రోజులకు తగ్గకుండా సాధారణ జైలు శిక్షలు (మిగతా 6లో)

ప్రసార మాధ్యమాల్లో పెయిడ్ ఆర్టికల్స్‌పై నిఘా

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ

ప్రసార మాధ్యమాల్లో ప్రచురితం, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా పెట్టాలని, ఈ విషయంలో ప్రసార మాధ్యమాల ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఎన్నికల సమయంలో ప్రచార మాధ్యమాలు అనుసరించాల్సిన విధివిధానాలపై జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్‌కుమార్‌తో కలిసి సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాలను మీడియా యూనిట్లు పాటించాలన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినప్పటి నుండి పెయిడ్ న్యూస్ అంశాన్ని సునిశితంగా పరిశీలించాలన్నారు. జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) పటిష్ట పర్యవేక్షణతో పని చేయాలన్నారు. నిర్దేశించిన రేట్ కార్డు ప్రకారం పెయిడ్ న్యూస్‌ను గణించి, ఆ వ్యయాన్ని సంబందిత అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే లోక్‌సభ అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభ అభ్యర్థి రూ.40 లక్షల మేర వ్యయం చేసేందుకు అమమతి ఉందన్నారు. ప్రింట్ మీడియాలో ప్రకటనలకు ముందస్తుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి అవసరం లేదని, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్, బల్క్ ఎస్ఎంఎస్, ఐవిఆర్ఎస్ యాడ్స్‌కు ఎంసీఎంసీ నుంచి అనుమతి అవసరమని వివరించారు. అనుమతి పొందిన అర్డరు కాపీ నెంబరును కూడా సంబంధిత ప్రకటనపై సూచించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని అన్ని ప్రచార మాధ్యమాలు తప్పనిసరిగా గమనించాలని ఆయన కోరారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రకటనలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పరిగణిస్తూ చట్ట ప్రకారం తగు చర్యలు చేపట్టడం జరుతుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ వి.శ్రీనివాసరావు, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వి మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ఇంగ్లీషు సులభంగా నేర్చుకోవచ్చు



మాట్లాడుతున్న రాం ప్రదీప్

ప్రజాశక్తి - తిరువూరు : ఆంగ్ల భాషను ఒక సబ్జెక్టుగా నేర్చుకోవద్దని, ఎటువంటి ఒత్తిడి లేకుండా సహజ సిద్ధంగా ఇతర భాషల మాదిరి గానే నేర్చుకోవాలని ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాంప్రదీప్ తెలిపారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం టోఫెల్ పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పూర్వ కాలంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఇంగ్లీష్‌ను సులభంగా నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రాధానోపాధ్యాయురాలు, ఎం.నాగకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది జయశ్రీ, పద్మా వతి, భరతకుమారి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బిజెపితో పొత్తుకు కారణం తెలపాలి

తిరువూరు ఎంఎల్ఎ అభ్యర్థి నల్లగట్ల



మాట్లాడుతున్న నల్లగట్ల స్వామిదాస్

ప్రజాశక్తి - తిరువూరు : జీవితాంతం బిజెపితో పొత్తు పెట్టుకోను అన్న చంద్రబాబు నేడు ఏ ముఖంతో పొత్తు పెట్టుకున్నారో ప్రజలకు బహిరంగంగా తెలపాలని వైసిపి తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాస్ డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురంలోని మాను గార్డెన్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయి వైసిపి కాపు సామాజిక వర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్వామిదాస్ మాట్లాడుతూ బిజెపి పొత్తుకోసం తహతహలాడిన పవన్, చంద్రబాబులు మోడీ తీసుకొచ్చి రాష్ట్రానికి భరోసా ఏమి తీసుకున్నారో చెప్పాలన్నారు. విభజన హామీలను, ప్రత్యేక హోదాపై బిజెపి స్టాండ్ ఏంటని మోడీని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. గ్రామ స్వరాజ్యం ద్వారా పేద లందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ముఖ్య మంత్రి జగన్ అని అన్నారు. రాష్ట్రంలో 27 శాతం ఉన్న కాపులకు పెద్దదిక్కుగా వ్యవహరిస్తారనుకున్న పవన్ కళ్యాణ్ చంద్రబాబుతో చేరి ఆయన్ను ముఖ్యమంత్రి చేయటానికి కాపులను బలిచేస్తున్నాడని జగ్గయ్యపేట వైసిపి అభ్యర్థి సామినేని ఉదయభాను అన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాపు సామాజిక వర్గం జగన్ వైపే ఉన్నారని టిడిపి జనసేన బిజెపి కూటమికి ప్రజల గట్టి గుణపాఠం చెప్తారని ఆయన వెల్లడించారు.

సామాజిక న్యాయమే వైసిపి లక్ష్యం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించి వారందరికీ సామాజిక న్యాయం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. నియోజకవర్గంలోని యాదవుల ఆత్మీయ సమావేశం సోమవారం స్థానిక కంఠమనేని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం బిసిలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బిసిలకు సముచిత స్థానం ఇచ్చారని అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ చరిత్రలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవితో పాటు అత్యంత ప్రధాన పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ ఆలయ ఛైర్మన్ పదవి కూడా యాదవ సోదరులకు తానే ఇచ్చానని తెలిపారు. మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య పదేళ్లు అధికారంలో ఉండి యాదవ్ సోదరులకు ఏమి న్యాయం చేశారని ప్రశ్నించారు. ఈ విషయాలను యాదవ సోదరులు ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో బిసిలకు ఎవరు సముచిత స్థానం కల్పించారో గమనించి వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పలు సెంటర్లలో చేసిన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారులు పరిశీలించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. అన్నిచోట్లా అధికారులు, పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకున్నట్లు నందిగామ ఆర్‌డిఒ రవీంద్రరావు తెలిపారు.

ప్రజాశక్తి - మైలవరం : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మైలవరం మండలంలో 9 సెంటర్లలో రెగ్యులర్ విద్యార్థుల్లో 1101 మందికి 1063, ప్రైవేట్ విద్యార్థుల్లో 114కి 38 హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి బాలు తెలిపారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు మంచినీళ్ళు, ఆరోగ్య సిబ్బంది, అందుబాటులో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి సెంటర్ వద్ద పోలీసులు ఉన్నారు. **కంచికచర్ల :** మండలంలో 6 సెంటర్లలో 959 మంది విద్యార్థులకు గానూ 922 మంది విద్యార్థులు హాజరయ్యారు. 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అక్షర ప్రైవేటు పాఠశాలలో 165 మంది విద్యార్థులకు గానూ 154 మంది విద్యార్థులు హాజరవగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విజయ రాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎ.సెంటర్‌లో 160 మంది విద్యార్థులకు గానూ 158 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇరువురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. బి.సెంటర్‌లో 148 మందికి గానూ 146 మంది పరీక్షలు రాయగా ఇరువురు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ కంచికచర్ల పాఠశాలలో 182 మంది విద్యార్థులకు గానూ 176 హాజరవ్వగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ పరిటాల పాఠశాలలో 132 మంది విద్యార్థులకు గానూ 123 మంది హాజరవ్వగా తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుభోదయ పాఠశాలలో 172 మందికి గానూ 165 మంది పరీక్షలు రాయిగా ఏడుగురు గైర్జారయ్యారు. 37 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. **వీరులపాడు :** మండల పరిధిలోని జుజ్జూరు, అల్లూరు, జయంతి, వీరులపాడు గ్రామాల్లోని పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాట్లను ఎస్ఐ మహాలక్ష్మణుడు పరిశీలించారు. **నందిగామ :** నందిగామ నియోజకవర్గంలో 4 మండలాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలతో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. 22 పరీక్షా కేంద్రాలు 4,180 మంది విద్యార్థులు 220 మందిరి ఇన్విజిలేటర్లతో ఉదయం 9.30 నుండి 12.45 వరకు పరీక్షా సమయం ఈ నెల 30వ వరకు పరీక్షలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. **నందిగామ :** నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం నందిగామ ఆర్ డి ఓ రవీంద్ర రావు తనిఖీ చేశారు. నందిగామ డాన్ బోస్కో స్కూల్ శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లను నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ రవీంద్ర రావు పరశీలించారు. **భవానీపురం :** ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి 178 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యాధరపురం, అరవిందవీధిలో ఉన్న బెజవాడ రాజారావు హైస్కూల్లోను 178 మంది విద్యార్థులను చుట్టుపక్కల నున్న వివిధ పాఠశాలల నుండి ఏర్పాటు చేసినట్లు కరెస్పాండెంట్ బెజవాడ రాజారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలిపారు. మొత్తం 30 పాఠశాలల నుండి విద్యార్థులు వచ్చారన్నారు. **గంపలగూడెం :** మండల వ్యాప్తంగా, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 887 మంది విద్యార్థులు అర్హత పొందగా, హాల్ టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. మొత్తం 6 సెంటర్లలో పరీక్షలునిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 199 మందికి గానూ 196 మంది హాజరు కాక ముగ్గురు గైర్హాజరయ్యారు. శ్రీ సరస్వతి విద్యాలయం-తోటమూల స్కూల్‌లో 96 మందికి గానూ 95 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. సాన్‌జోస్ హైస్కూల్‌లో 114 మందికి 100 మంది హాజరై 14 మంది గైర్హాజరయ్యారు. శ్రీ గాయత్రీ విద్యాలయం-తోటమూల 160 మందికి 131 మంది హాజరుకాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఊటుకూరులో 137 మందికి 131 మంది హాజరై 6 మంది గైర్హాజరయ్యారు. శ్రీ సిద్ధార్థ విద్యాలయం - ఊటుకూరులో 181కి గానూ 166 హాజరై 15 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 887 మందికి 846 మంది హాజరై 41 మంది గైర్హాజరుగా అధికారులు వివరించారు.



మైలవరంలో విద్యార్థులను తనిఖీ చేస్తూ...



నందిగామలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



భవానీపురంలో...

వైసిపి హయాంలో ప్రాజెక్టులు అధ్వానం



ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగన్ రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆంధ్రప్రదేశ్ నిర్ణయించుకుందని వైసిపి ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురాం అన్నారు. పట్టణంలోని రఘురాం స్వగృహంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలుగుదేశం ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 72శాతం పూర్తి చేస్తే, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం దాన్ని అడ్డుకుందన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ అధ్వానంగా మారాయన్నారు.



టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణానికి చెందిన 4వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మారం అమరయ్య, 13వ వార్డు కౌన్సిలర్ గద్దె శేషు కుమారి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ గద్దె రమేష్, వైసిపి నాయకులు సోమవారం టిడిపిలో చేరారు. పట్టణ టిడిపి కౌన్సిలర్లు, నాయకుల బృందం నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, టిడిపి, బిజెపి, జనసేన నియోజకవర్గ ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి తంగిరాల సౌమ్య, విజయవాడ పార్లమెంట్ టిడిపి నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) టిడిపి కండవాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శివపార్వతుల కళ్యాణం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో 71వ శ్రీరామ కోటి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం ఆలయ ఇఒ వాసిరెడ్డి భూపాల్, సీతారామ నామ సంకీర్తన సంగం అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులు పారేపల్లి సాయిబాబు, దుడ్డు నాగేశ్వరరావు, పులిపాటి శ్రీనివాసరావు సంఘ సభ్యుల పర్యవేక్షణలో వేద పండితులు సన్నిధానం కిషోర్ శర్మ వైదిక సాంప్రదాయ పద్ధతుల నడుమ ఆలయంలో పూలతో అలంకరించిన కళ్యాణ వేదికపైశ్రీ శివపార్వతుల దివ్య కళ్యాణం నిర్వహించారు.



రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామములో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రతి రోజు జరుగు తున్న నిత్యాన్నదాన పథకానికి. సోమవారం జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఉక్కుటూరి శ్రీనివాస్ రూ.50,464 లు విరాళంగా అందజేశారు. మైలవరం మండలం వెల్వడంకు చెందిన కుడుముల తిరుమలరెడ్డి, గోవింద లక్ష్మి రూ.10,116 లు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.శ్రీరామ వరప్రసాద రావుకు విరాళంగా అందజేశారు. దాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.





సరోజినికి నివాళి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని 4 వ వార్డులో వైసిపి రాష్ట్ర నాయకులు, వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్ల బ్రహ్మాం మాతృమూర్తి చల్లా సరోజినీ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్‌మోహన్‌రావు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం


గుడివాడలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థినులు


జంక్షన్‌లో పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు అవనిగడ్డ లోని మూడు సెంటర్లలో ప్రశాంతంగా మొదటి పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య, ఎన్‌ఆర్‌ఐ వికాస్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మూడు సెంటర్లలో కలిపి మొత్తం 593 మంది విద్యార్థులను కేటాయించగా అందులో పది మంది విద్యార్థులు గైరాజరైనట్లు రూట్ ఆఫీసర్ ఎంఈఓ ఎన్ శివశంకరరావు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 204 మందికి గాను 198 మంది హాజరు కాగా ఆరుగురు విద్యార్థులు గైరాజరయ్యారు. అదేవిధంగా ఎన్నారై వికాస్ లో 229 మందికి 226 మంది హాజరు కాగా ముగ్గురు గైరాజరయ్యారు. శ్రీ చైతన్య పాఠశాలలో 170 మంది విద్యార్థులకు గాను 169 మంది హాజరు కాగా ఒకరు గైరాజరైనట్లు ఎంఈఓ చెప్పారు. పరీక్షా సెంటర్ల వద్ద పోలీసులతో బందోబస్తు నిర్వహించడంతోపాటు విద్యార్థులకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేసి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు నిర్వాహకులు తీసుకున్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూరు, మండల పరిధిలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రార ంభమ య్యాయి. ఉయ్యూరు పట్టణ పరిధిలో ఆరు, ఆకునూరు ప్రభుత్వ హైస్కూల్లో ఒకటి, కాటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశా రు. నిర్ణీత సమయానికి అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేందాలకు చేరుకోగా వారిని తనిఖీచేసే లోపలికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి ఏవిధమైన అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎనిమిది కేంద్రాల్లో 1480 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 1425 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరైనట్లు ఉయ్యూరు డీవైఈవో పద్మారాణి తెలిపారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్:** బాపులపాడు మండ ల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతూ పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే 896మంది విద్యార్థులున్నారు. వీరి కోసం వీరవల్లి, బాపులపాడు, కానుమోలు, అరుగొలను, తదితర గ్రామాల్లో 8 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన పరీక్షలకు 827మంది హాజరు కాగా 68మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ రాంబాలాసింగ్ తెలిపారు. విద్యార్థులు పరీక్షాకేంద్రాల్లోకి అనుమతించే మదు వారిని తనిఖీలు చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేందుకు వీలుగా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి సిఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో హనుమాన్జంక్షన్ ఎస్సై జనార్ధన్, వీరవల్లి ఎస్సై చిరంజీవి, పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది పహారా నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎంఈఓ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. **ప్రజాశక్తి - గుడివాడ** : సోమ వారం నియోజకవర్గంలో 10వ తరగతి విద్యార్థులకు 13 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. అవాంఛ నీయ సంఘటనలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు చర్యలు తీసుకుని, పోలీసులను ఏర్పాటు చేశారు.


అగ్నిప్రమాదం సంబవించిన ప్రాంతంలో గోదాం శుభ్రపరుస్తున్న కూలీలు

అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆకునూరులో పాత ప్లాస్టిక్ గోదాములో ఆదివారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదంలో మంటలను సోమవారం ఉదయానికి అగ్నిమాపక సిబ్బంది ఆర్పివేశారు. ఈప్రమాదంలో గోదాములోపల, బయట ఆవరణ, సర్వీసురోడ్డుపక్క ఉంచిన పాత ప్లాస్టిక్, పాతఇనుప సామాను నుంచి ఉవ్వెత్తున్న మంటలు, పొగ లేవడంతో చుట్టుప క్కల నివసిస్తున్న వారు భయాందోళనకు గురయ్యారు. కేజీకి నాలుగు రూపాయలు ధర తగ్గిందని, నాలుగురోజులు గడిస్తే ధర పెరుగుతుందేమో అన్న ఆశతో భారీ మె త్తంలో పాత ప్లాస్టిక్, ఇనుము గ్రేడింగ్ చేసి కట్టలు కట్టి నిల్వ ఉంచితే అగ్ని ప్రమాదంలో అంతా కాలి బూడిదయ్యిందని యజమాని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశా రు. కాగా ఈప్రమాదంలో ప్లాస్టిక్, ఇనుము సమానుతో పాటు గోదాము షెడ్డులు దగ్ధం కాగా పెద్దమొత్తంలో ఆస్తినష్టం సంబవించిందని బాధితులు బోరుమన్నారు.


ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

వైసిపి రంగులు తొలగించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-అవనిగడ్డ : గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవనిగడ్డ విచ్చేసిన సందర్భంగా రోడ్డు పక్కన చెట్లకు విద్యుత్ స్తంభాలకు వైసీపీ జెండా రంగులు వేశారని, అదేవిధంగా వై నాట్ 175 అని రాయించారని శిలాఫలకాలపై నాయకుల ఫోటోలు కూడా ఉన్నాయని వెంటనే వాటిని తొలగించాల్సిందిగా కోరుతూ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సోమవారం టిడిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయానికి టిడిపి నాయకులు విచ్చేసి ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళిని అనుసరించాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండి రాఘవ, బచ్చు రఘునాథ్, మండలి రామ్మోహన్రావు, మేడికొండ విజయ్, దాసినేని శ్రీనివాసరావు, ఎలవర్తి చిన్న, షేక్ బాబావాలి, కొల్లూరి వాసు రేపల్లె అంకినీడు కొల్లూరి ఇమ్మానియేల్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-పమిడిముక్కల : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని పమి డి ముక్కల సిఐ కిషోర్‌బాబు అన్నారు. సోమవారం మండలం లోని చోరగుడి, లంకపల్లి, మద్రివాడ, మంటా డ, కిష్టాపురం గ్రామాలలో ఆర్మీ ఎడిషన్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కేంద్ర కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాం టి దుర్ఘటనలు జరగకుండా కవాతు నిర్వహించామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కూడిపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న బలగాలు

తుమ్మల చిన్నా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ తుమ్మల చిన్నా జన్మదిన వేడుకలు సోమ వారం ఘనంగా నిర్వహించారు. స్నేహితులు ఏర్పాటుచేసిన కేకును చిన్నా కట్ చేసి అందరికీ తినిపించారు. వైయస్‌ఆర్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, సాయి లక్ష్మీ రోడ్ లైన్స్ అధినేత ఏ ఎస్ పి రెడ్డి కేకును చిన్నాకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. స్నేహితుల మధ్యలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. ఎటువంటి ఆడంబరం లేకుండా వేడుకలు చేయడం పట్ల స్నేహానికి ఉన్న గొప్పతనం తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంగళ నాని, మద్దినేని వెంకటేశ్వరరావు, రాంబాబు, రామారావు, నాగేందర్ రావు, బెజవాడ వాసు పాల్గొన్నారు.

గూడపాటి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - గుడివాడ : పాత తరం కమ్యూనిస్టుల సేవలు పోరాటాలతో కూడినవని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ మెంబర్ మోదుమూడి రామారావు, ఆయన సతీమణి అరుణలు అన్నారు. సోమవారం స్థానిక పెద్దఎరిపాడులోని సీనియర్ నాయకుడు కామ్రేడ్ గూడపాటి సువిశేశ్వరరావును ఆయన స్వగృహంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ నెంబర్ కామ్రేడ్ మోదుమూడి రామారావు, అయన సతీమణి అరుణలు పరామర్శించి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భగా అయన మాట్లాడుతూ గూడపాటి పేదల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన పోరాటాలు నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, పార్టీ నాయకులు నిర్మలజ్యోతి, భవానీ, మేరిమ్మ, సునీత, సంతోషం ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.


గూడపాటిని పరామర్శిస్తున్న మోదుమూడి దంపతులు

మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ప్రజాశక్తి-పెడన : వైయస్ జగన్ ప్రభుత్వంలో మహిళలకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. సోమవారం మండల పరిధిలోని పుల్లపాడు గ్రామంలో ఇంటింటికి వైఎస్‌ఆర్సిపి శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాముతో కలిసి గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ తోడబుట్టిన వారికి ఇళ్ల స్థలాలతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు, దిశా చట్టాలను తీసుకొచ్చారని అన్నారు. మరోమారు జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని వస్తే మరిన్ని సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గరికిపాటి వెంకట రామానాయుడు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అడపా బాబ్జీకు నివాళి


అడపా బాబ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - గుడివాడ : అందరితోను కలసి ఉండే మహోన్నత వ్యక్తి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అడపా వెంకటరమణ(బాబ్జీ) అని వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా నాయకులు మండలి హనుమంతరావులు అన్నారు. సోమవారం స్థానిక శరత్ థియేటర్‌లోని వైసిపి కార్యాలయంలో అడపా బాబ్జీ 3వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాకి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంలో అందరితో కలసి మెలసి ఉండే నాయకుడు అడపా అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నాయకులు వెంపటి సైమన్, చింతల భాస్కర్, చూండూరి శేఖర్, కొంకితల ఆంజనేయప్రసాద్, అల్లం రామ్మోహనరావు, రేమల్లి నీలాకాంత్, మామిళ్ళ ఎలిషా, తోట సాయి, తాళ్ళూరి ప్రశాంత్, మాదాసు వెంకటలక్ష్మీ, జ్యోతుల సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మోపిదేవి : అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు భోగి రెడ్డి సాంబశివరావు తండ్రి సుబ్బారావు అనారోగ్యంతో మతి చెందగా సోమవారం అవనిగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు మాదివాడ వెంకటకష్ణ (క్రిస్టియన్) భోగి రెడ్డి సాంబశివరావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని వైవి.రావు అసోసియేట్స్ అధినేత వైవి.రావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కన్స్యూమర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన సదస్సును సోమవారం ఆ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన వైవి.రావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం ప్రజలకు అనేక అంశాల్లో రక్షణ కల్పిస్తుందన్నారు. వినియోగదారులు దుకాణాదారుల నుంచి మోసపోకుండా, నష్టపోకుండా అనేక చట్టాలు అండగా నిలుస్తాయన్నారు. వస్తు, సేవల కొనుగోలు క్రమంలో ఎదురయ్యే నష్టం లేదా ఇతర సమస్యల నుంచి వినియోగదారులకు అండగా ఉండేందుకు ఈ చట్టాలు దోహదపడతాయన్నారు. అయితే వాటిపై విద్యార్థులకు ఇతర ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. ఆ దిశగా ఈ విధమైన కార్యక్రమాలు దోహదపడతాయని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని క్లబ్ కన్వీనర్ విజయబాబు టెక్కెం నిర్వహించగా కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగాధిపతి ఎన్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిటిపిఎస్ కాలుష్య సమస్యపై

చేతులెత్తేసిన అధికారులు



సమావేశానికి హాజరైన అధికారులు, స్థానికులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ విరజిమ్ముతున్న కాలుష్య విషం భరించలేమంటూ బాధిత ప్రజలు తిరగబడ్డారు. కాలుష్య నియంత్రణ పోరాట సమితి పేరుతో కాలుష్యంపై వ్యతిరేక పోరాటం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులను అక్రమంగా నిర్బంధించడంతో ఆగ్రహించిన స్థానికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో దిగివచ్చిన ఎన్‌టిటిపిఎస్ అధికారులు డిమాండ్లు పరిశీలించడానికి సోమవారం చీఫ్ ఇంజినీర్ అధ్యక్షతన స్థానిక ఎఇ అసోసియేషన్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పోరాట సమితి సభ్యులు తమ డిమాండ్లు పెట్టారు. వాటిని పరిష్కరించే అధికారం తమకు లేదని, డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడం వరకే తమ బాధ్యత అని, తమ చేతిలో ఏమీ లేదని ఎన్‌టిటిపిఎస్ అధికారులు చేతులు దులుపుకున్నారు. బూడిద ఓవర్ లోడింగ్, రోడ్డుపై ఇష్టారాజ్యంగా బూడిద లారీలు ఆపటం, పగలు లోడింగ్ ఆపి రాత్రి సమయంలో చేయడం వంటి వాటిపైన కనీస చర్యలు అయినా చేపట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో చర్చించి 10 రోజుల్లో మరో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని చీఫ్ ఇంజనీర్ నాగరాజు ప్రకటించి జారుకున్నారు. కనీసం చేయవలసిన పనులు చేయకుండా, స్పష్టమైన రాతపూర్వక హామీ ఇవ్వకుండా, కనీస నివారణ చర్యలపై సైతం మౌనం వహించడంతో సమావేశం నిరాశ జనకంగా ముగిసింది. ఉన్నతాధికారులు స్పందించకపోతే పోరాటాన్ని ఉధతం చేయడమే మార్గంగా కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు, స్థానికులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి అధ్యక్షుడు చెరుకుమల్లి సురేష్, కార్యదర్శి కరీముల్లా, చెరుకూరి వేణుగోపాల్, బిజెపి నేత నూతులపాటి బాలకోటేశ్వరరావు, జనసేన నేత అక్కల గాంధీ, నరసింహా రెడ్డి, వి.ఆర్.నాగిరెడ్డి, నల్లమోతు ప్రసన్న బోస్, అనిల్ డ్యానీ, భద్ర, మాధురి, భవానీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో బిసిలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - భవానీపురం : రాష్ట్రంలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి గౌరవించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కి మద్దతుగా నియోజకవర్గ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు, షేక్ ఆసిఫ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు, ఆసిఫ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత తమ సామాజిక వర్గానికి మంత్రి పదవిని



మాట్లాడుతున్న వెలంపల్లి

కేటాయించటంతో పాటు పలువురు ఎమ్మెల్యేలుగా, చైర్మన్లుగా నియమించారని గుర్తు చేశారు. సభకు సంఘం అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, మండేపూడి ఛటర్జీ, సంఘం యువజన విభాగ నగర అధ్యక్షులు గుడిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


చట్ట సభలకు ఎర్రజెండా పార్టీలను పంపించండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి, భవానీ పురం : ప్రజా సమస్యలపై గొంతెత్తే ఎర్రజెండా పార్టీల ప్రతినిధులను చట్ట సభలకు పంపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సిపిఐ అభ్యర్థి ఎన్నికల బరిలో ఉంటున్నారని తెలిపారు. సిపిఐ ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లాల సమితుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక సితారా సెంటర్ వద్ద గల ఎన్ కన్వెషన్ హాల్‌లో సోమవారం సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చిలకలూరిపేట సభలో ప్రధాని మోదీ అన్ని అబద్ధాలు చెప్పారని విమర్శించారు. కాంగ్రెస్, వైసిపిలు రెండు ఒక్కటే అని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. జగన్ పాలన అరాచకంగా ఉండటానికి కేంద్రంలోని బిజెపియే కారణం అన్నారు. కేంద్రం అనుమతి లేనిదే అప్పులు తీసుకురాలేరని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు ఓట్లు వేయరని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి విజయం



సాధించటం తధ్యం అన్నారు. సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ 2014లో టీడీపీ, బీజేపీ పొత్తు ఉందని, 2019లో బీజేపీతో వైసీపీ లోపాయకారి పొత్తు ఉందని డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నా ఏపీ అభివృద్ధిలో వెనుకబడిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు, సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడారు. ఈ సమావేశానికి సిపిఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య స్వాగతం పలికారు. విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు వందన సమర్పణ చేశారు.



పిచ్చిమొక్కలతో ట్రాన్స్‌ఫార్మర్

శుభ్రం చేయించిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతం

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : స్థానిక శాంతినగర్‌లో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫారం ప్రజాశక్తి వార్తకు స్పందించిన విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సోమవారం చెత్త తొలగింపు చేపట్టారు. ఈనెల 16న ప్రజాశక్తిలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు శీర్షికను వార్త ప్రచురితమైంది. దీంతో శాంతినగర్లో భాస్కర్‌షాపు దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫారం దగ్గర పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పరిసర ప్రాంతాలు పరిశుభ్రం చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



పోతినకు పశ్చిమ సీటు కేటాయించాలని నిరసన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ విజయవాడ పశ్చిమ సీటును పోతిన మహేష్‌కి ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించి గిఫ్ట్‌గా ఇస్తామని ముస్లిం మహిళలు, పార్టీ కార్యకర్తలు అన్నారు. సోమవారం నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ సీటును జనసేన పార్టీ పశ్చిమ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్‌కి కేటాయించాలని పశ్చిమ జనసేన యువత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి సామారంగ్ చౌక్ లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి శాంతియుత నిరసన ప్రదర్శన చేశారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా బొగ్గవరపు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - వత్సవాయి : ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ నడుం బిగించి పనిచేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, జగ్గయ్యపేట మాజీ శాసన సభ్యులు రాజగోపాల్ తాతయ్య అన్నారు. మండల కేంద్రమైన స్థానిక వత్సవాయి శ్రీ వాసవి కళ్యాణ మం డపం ప్రాంగణంలో ఎన్టీఆర్ జిల్లా తొలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షు లుగా బొగ్గ వరపు వెంకట రాజారావు, జిల్లా మహిళా విభాగం, యువజన సంఘం విభాగం, కార్యవర్గ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు శ్రీ రామ చిన్ని రామ సత్యనారాయణ, అంబికా కృష్ణ, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు, మాజీ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు, పెనుగొండ సుబ్బారాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు కొప్పురావూరి రజనీ పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేసి ప్రమాణస్వీకారం చేయిస్తున్న తాతయ్య, తదితరులు



సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలంలో గల చందాపురం సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను, ప్రభుత్వ కార్యాలయాలను నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.రవీంద్రరావు సోమవారం పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల చిత్ర పఠాలు తొలగించాలని, పోలిటకల్ ఫ్లెక్సీలు తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు దరించాలని కోరారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నందిగామ : గ్రామాల్లో మాదిగలు అప్రమత్తంగా ఉండాలని ఎంఆర్‌పిఎస్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు దొండపాటి సుధాకర్ మాదిగ పిలుపునిచ్చారు. ఎన్నికల వేళ తాము అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామంటూ కొందరు వస్తారని వారిని ప్రశ్నించేలా తయారవ్వాలని మాదిగలను ఆయన సూచించారు. నందిగామ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నందిగామ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కనకపూడి వెంకట రత్నం మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు యద్దనపూడి లక్ష్మణ్, నండ్రు మరియదాస్, కోట అశోక్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు అందని వేతనాలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నగర పంచాయతీ పరిధిలో పనిచేసే వాలంటీర్లకు ప్రతినెలా ఒకటి 2వ తారీకులోగా పడే జీతాలు ఇంతవరకు 18 వ తారీఖు వచ్చినా అందలేదు. గతంలో ట్రాన్ఫర్ మీద వెళ్ళిన కమిషనర్, కొత్తగా వచ్చిన కమిషనర్ డిజిటల్ కీ సంతకం లాగిన్ లేట్ అవ్వడం, సరిగా స్పందించకపోవడం వల్ల వాలంటీర్లకు జీతాలు లేటయిందని వస్తే వారంలో వస్తాయని లేకపోతే ఫిబ్రవరి, మార్చి కలిపి ఏప్రిల్ మొదటి వారంలో వస్తాయని తాము మాత్రం ప్రభుత్వానికి పంపామని అధికారులు చెబుతున్నారు. ఒకసారి లేట్ అయితే వచ్చే నెల వస్తాయో రావోనన్న ఆందోళనలో వాలంటీర్లు ఉన్నారు. కావున తక్షణమే అధికారులు స్పందించి ఫిబ్రవరి నెల జీతం వచ్చే విధంగా చేయాలని వాలంటీర్లు కోరుతున్నారు.



సమస్యలు వింటున్న వెనిగండ్ల రాము

కూరాడలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలో కూరాడ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గుడివాడ నియోజకవర్గ టిడిపి పార్టీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలోసోమవారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ, సూపర్ సిక్స్ మేనిఫెస్టో అంశాలను ప్రజానీకానికి రాము వివరించారు. వివిధ వర్గాల ప్రజానీకంతో మమేకమవుతూ, ఆత్మీయ పలకరింపుల మధ్య ప్రచారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మండల టిడిపి అధ్యక్షుడు కోసరాజు బాపయ్య చౌదరి,పార్టీ నాయకులు కొడాలి రామరాజు, వల్లభనేని బాబురావు, సాయన పుష్పవతి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిగా శివప్రసాద్ నియామకం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారిగా టి.శివప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి రాజాబాబును వారి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఘనంగా చంద్రాల పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ జగన్మోహ నరావు అన్నారు. మండలంలోని చంద్రాల మండల పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి విద్యార్థులకు బహుమతులను అంద జేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్ర మాలు తల్లిదండ్రులను ఆనందింపపరిచాయి. ఎంఈఓ-2 గోపాల్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుండి ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పెడన నియోజకవర్గం పరిధిలోని కత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల్లో తాగునీటి సమస్య తలెత్తడంతో దాన్ని పరిష్కరించేందుకు 27 గ్రామాల్లో ట్యాంకర్లతో తాగునీటి సరఫరాకు కలెక్టర్ అనుమతి మంజూరు చేశారు.కత్తివెన్ను మండలంలో 5 గ్రామాలు ఇంతేరు (పార్వతీపురం) ఉప్పులూరు, రామా పురం, సీతారాం పురం, మాట్లం, బంటుమిల్లి మండలం లో 5 గ్రామాలు బంటుమిల్లి వడ్లగరువు, చోరంపూడి, మల్లంపూడి, గార్లగుంట, కొత్తూరు, పెడన మండలంలో 17 గ్రామాలు కమలాపురం, ఉప్పలకలవగుంట, ఉప్పల కలవగుంటపాలెం, కోప్పల్లి, ముచ్చిలిగుంట, ముచ్చర్ల, ములమర్రి గుంట, గురువిందగుంట, కవిపురం, నేలకొండపల్లి, పెనుమల్లి, ఎస్వీ పల్లి,, దిరిశవల్లి, చోడవరం, పుల్లపాడు, చినపుల్లపాడు, దేవరపల్లి మొత్తం 27 గ్రామాలకు ఈనెల 20వ తేదీ నుండి ట్యాంకర్లతో తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.తాసిల్దార్లు మండల పరిషత్ అభివద్ధి అధికారులు గ్రామాల్లో తాగునీటి సరఫరా పర్యవేక్షించాలని, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి టి. శివప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ, ఏ ఈ లు టెలికాన్ఫరెన్సో పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పెద్దపీట : రాము



సదస్సులో మాట్లాడుతున్న ఉప్పాల రాము

ప్రజాశక్తి-పెడన : నేర్చుకున్న పనిని అందరికీ అతీతంగా నేర్పించేది నేతన్న ఒక్కరేనని వైసిపి అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. సోమవారం స్థానిక పోలవరపు పేటలోని దేవాంగ కళ్యాణ మండపంలో చేనేత కార్మికుల, దేవాంగ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ కమిటీ చైర్మన్ బీరక సురేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఈ సమావే శంలో ఉప్పాల రాము మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేనేత కార్మికులకు పెద్ద పీట వేశారన్నారు. నేతన్న నేస్తం కింద ఒక్క కుటుంబానికి ఏడాదికి 24000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న నేతన్న నేస్తం కార్యక్రమాన్ని కూడా ఆయన పుట్టినరోజు నాడే అమలు చేయడం దేవాంగులు హర్షించ దగ్గ విషయమని గుర్తు చేశారు. చేనేత కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛను ఇవ్వాలని దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆచరణలో పెట్టారని అది ఇప్పుడు వైఎస్ జగన్ అమలు పరిచారన్నారు. తనను అసెంబ్లీ అభ్యర్థిగా గెలిపిస్తే వీవర్స్ సొసైటీకి చెందాల్సిన 39 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆప్కాబ్ చైర్మన్ ను నియమించి నేతన్నలు తయారు చేసే వస్త్రాలకు గిట్టుబాటు ధర లభించేలా ప్రణాళికను రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంఘ కార్పొరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్ర తాతారావు, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చుక సతీష్ బాబు, వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ముదునూరు పీఏసీఎస్ అధ్యక్షుడు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యుల సంక్షేమం, అభివద్ధికి జిల్లా సహకార బ్యాంకు కట్టుబడి ఉందని ముదునూరు ప్రాథమిక వ్యవసాయ సహకర పరపతి సంఘం చైర్పర్సన్ పాలడుగు సత్యనారాయణ అన్నారు. సంఘ సభ్యురాలు డె క్కా విశ్రాంతమ్మ ఇటీవల మరణించగా మట్టి ఖర్చుల నిమిత్తం సంఘ నిధులనుంచి రూ. 10వేల ఆర్థిక సహాయం సోమవారం ఆమె కుటుంబ సభ్యులకు చైర్ పర్సన్ అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో సంఘాలలోని సభ్యులకు సహాయం చేసేందుకు నిధులు సంఘాల ద్వారా సమకూర్చు తుందన్నారు. సంఘ సీఈఓ తుమ్మల శ్రీనివాసరావు, సభ్యులు కుర్రా వెంకటేశ్వరరావు . చిందా కష్ణమోహన్ రాజు, వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో గుడ్లవల్లేరు విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : భారత దేశంలోనే అతిపెద్ద నిర్మాణ సంస్థ అయిన కల్పతరు ప్రాజెక్ట్స్ వారు ఈ నెల1వ తేదీన గవర్నమెంట్ మరియు ప్రైవేట్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రాంగణ నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా తుది ఫలితాలను ఈనెల 15 వతేదీన ప్రకటించారు. వారిలో రాష్ట్ర వ్యాప్తంగా గవర్నమెంట్, ప్రైవేట్ పాలిటెక్నిక్ ల నుండి 15 మంది విద్యార్థులను ఎంపిక చేయగా వారిలో అత్యధికంగా గుడ్లవల్లేరు ఏ.ఏ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్. ఆర్.పాలిటెక్నిక్ నుండి 5 గురు సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూ.2.75 లక్షల వార్షిక వేతనంతో కొలువులు సాధించారని కొలువులు సాధించిన వారికీ కల్పతరు సంస్థవారే పూర్తి ఉచిత వసతి,భోజన సదుపాయాలు కల్పిస్తారని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తెలియజేసారు. విద్యార్థులు అతిచిన్న వయస్సులోనే కొలువులు సాధించడం అనేది ఒక్క డిప్లొమా విద్యతోనే సాధ్యపడు తుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎమ్.వినయ్‌ని, కొలువులు సాధించిన విద్యార్థులను, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి.ఎమ్.ఎన్.కిరణ్ లను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ, కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో-సెక్రెటరీ, కరస్పాండెంట్ వల్లూరిపల్లి రామకష్ణ , ఎగ్జిక్యూటివ్ మెంటార్ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ లు అభినందించారు.

ప్రచార వాహనాలకు అనుమతులు తప్పనిసరి : జెసి

ప్రజాశక్తి-గన్నవరం : రానున్న ఎన్నికలకు సంబంధించి గన్నవరం నియోజకవర్గంలో రాజకీయ పార్టీల అభ్యర్థులు వాహనాలపై ప్రచారం చేసుకోవడానికి ముందస్తుగా అనుమతులు తీసు కోవాలని ఎన్నికల అధికారి, జేసి గీతాంజలి శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే గ్రామాల్లో కట్టిన హోర్డింగ్లను తొలగించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ప్రచారం నిమిత్తం ఏర్పాటు చేసే హోల్డింగులకు అనుమతులు ముందుగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడ హో ల్డింగులు పెట్టకూడదన్నారు. ప్రైవేటు స్థలాల్లో పెట్టాలనుకుంటే స్థల యజమానులు ముందుగా అనుమతి పొందాలన్నారు. వాహనాలపై ప్రచారం చేసేవారు వాహనాలకు సంబంధించిన కాగితాలు చూపించి అనుమతి పొందాలని వివరించారు. అనుమతులు లేకుండా నడిచే వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ను దష్టిలో ఉంచుకొని ప్రచార కార్యక్రమాలు జరుపుకోవాలని మంచి దన్నారు. అధికారులకు పూర్తిగా సహకరించాలని విన్నవించారు.

దక్షిణచిరువోలు లంక కార్యదర్శిగా జాహ్నవి



ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక గ్రామ కార్యదర్శిగా తోట జాహ్నవిని నియమించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జీవో ఎంఎస్ నెంబర్ 11 ఆధారంగా డి డి ఓ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు గ్రామ పంచా యతీ కార్యదర్శిగా వై.రమా కుమారి విధులు నిర్వహిస్తున్నారు. కాగా నేటి నుండి జాహ్నవి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తారని రమాకుమారి తెలిపారు. జాహ్నవిని పంచాయతీ సర్పంచ్ సనక సుబ్రహ్మణ్యంతో పాటు సచివాలయం సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.



ఎన్నికల కోడ్ అమలుపై సమీక్ష

ప్రజాశక్తి-అవనిగడ్డ : మేలో జరగనున్న అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమ ల్లోకి వచ్చినందున అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆరు మండలా లకు చెందిన ఎంపీడీవోలతో ఎన్నికల కోడ్ పై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు తప్పనిసరిగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

నేడు గ్రామోత్సవం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థాన దత్తత దేవస్థానం శ్రీ అభయాంజనేయ స్వామి వారి వార్షికోత్సవం రెడ్డిపాలెంలో ఈనెల 19 వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు శ్రీ స్వామి వారికీ అభిషేకం అనంతరం సహస్ర నామార్చన, సాయంత్రము 6.30 గంటలకు స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు సురేష్‌బాబు తెలిపారు. అనంతరం గ్రామోత్సవము నిర్వహిస్తామని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'పది' పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ఉమ్మడి కృష్ణాలో 1881 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అధికారులు





పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ (విజయవాడ)

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల సందర్భంగా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో తొలిరోజు పరీక్ష విజయవంతంగా జరిగింది. సోమవారం జరిగిన ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు పరీక్ష)కు ఎన్‌టిఆర్ జిల్లాలో 178 పరీక్షా కేంద్రాలకు మొత్తం 28,458 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27,693 మంది (97.31 శాతం) హాజరయ్యారు. తొలిరోజు పరీక్షకు 765 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా ఆయా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, బంధువులు ఉదయం 8 గంటలకే చేరుకున్నారు. దీంతో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం కనిపించింది. పరీక్షకు విద్యార్థులను ఉదయం 9 గంటల నుండి పరీక్ష హాల్లోకి అనుమతించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ పర్యవేక్షించి పరీక్షను సమర్థవంతంగా జరిగే విధంగా కృషి చేశారు. జిల్లా స్థాయి పరిశీలకులు డిఎల్‌వో శ్రీనివాసులురెడ్డి నగరంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్, పటమట జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, పటమటలంక ఉన్నత పాఠశాల, కృష్ణవేణి ఇంగ్లీషు మీడియం స్కూల్స్‌ను సందర్శించి పరీక్ష జరిగే తీరును పరిశీలించారు.

గవర్నర్‌పేట చుండూరు వెంకటరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు సందర్శించారు. పరీక్ష జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు కేంద్రంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి ఏర్పాట్లు సరిగా ఉన్నాయో లేదో చూశారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, ఏవిధమైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తీసుకురాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని చీఫ్ సూపరింటెండెంట్లకు, పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 178 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో పదో తరగతి పరీక్షలు మొదటి పేపర్ ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెర సుల్తానా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 22,615 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 21,499 మంది హాజరయ్యారు. 1,116 మంది గైర్హాజరయ్యారు. జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఇతర అధికారులు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

మొదటిపేజీ తరువాయి

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

వేస్తున్నారు. దీంతో పాటుగా నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు జరిమానా విధిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిలోనూ, ట్రాఫిక్ ఉల్లంఘించే వారిలోనూ ఎక్కువ మంది యువకులే ఉంటున్నారని, ఇది వారి భవిష్యత్తుకు మంచిది కాదని పోలీసులు చెబుతున్నారు.

అంతర్మథనం

అవసరాలకు ఈ నిధులను మళ్లించినా, స్కీమ్ ప్రారంభించి ఏడేళ్లు దాటినా దానిని పూర్తి చేయించడానికి కేంద్రం కానీ, ఇక్కడి బిజెపి నేతలు కానీ జోక్యం చేసుకున్న పరిస్థితి లేదు. వినోదపు పన్ను విఎంసికి జమ కావడం లేదు. నిధులు, గ్రాంట్లు ఇవ్వడం ఏమో కానీ పట్టణ సంస్కరణల పేరుతో పలు రూపాల్లో నగర ప్రజలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కోట్లాది రూపాయలు భారాలను మోపిన ఘనత కేంద్రంలోని బిజెపికే దక్కుతుందని నగర ప్రజలతో పాటు ప్రత్యేకించి టిడిపి శ్రేణులు గుర్తు చేసుకుంటున్నాయి. గత టిడిపి ప్రభుత్వ కాలంలో కూడా నగరపాలక సంస్థకు కేంద్రం నుంచి మంజూరు అయిన నిధులు కూడా అంతగా వచ్చిందేమి లేదని టిడిపి వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయి. ప్రధానంగా పట్టణ సంస్కరణల పేరుతో చెత్త పన్ను దగ్గర నుంచి విలువ ఆధారిత ఆస్తి పన్ను, డ్రైనేజి పన్ను, మంచినీటి ఛార్జీలు, వినోదపు పన్ను, మరీ ముఖ్యంగా నగరపాలక సంస్థకు రావాల్సిన రాబడిని జిఎస్‌టి రూపంలో కేంద్రం గుంజుకోవడం వంటి వాటిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. కృష్ణానదిని ఆనుకొని ఉన్న విజయవాడ నగర వాసులు నీటిని సరుకుగా కొనుక్కొని తాగాల్సిన దుస్థితికి తీసుకురావడానికి ముఖ్యంగా కేంద్రంలోని బిజెపినే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 24/7 పేరుతో రూ.100 కోట్లు అమృత్ స్కీమ్ పేరుతో గ్రాంట్‌ను కేంద్రం ఇస్తుందని, ఆపేరుతో ప్రతి ఇంటికీ నీటి మీటర్లు బిగించి, నీటి నిర్వహణకయ్యే వ్యయాన్ని మొత్తాన్ని ప్రజల వద్ద నుంచి రాబట్టాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెట్టిన షరతుల పట్ల నగర వాసులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. సిపిఎం, ఇతర ప్రజాసంఘాలు, స్థానిక ప్రజలు చేసిన ఆందోళన ఫలితంగా మధురానగర్ ఏరియాలో ఇళ్లకు అమర్చిన నీటి మీటర్లను అతి బలవంతంగా విఎంసి అధికారులు తొలగించక తప్పలేదు. అయినా ఏదో ఒక రకంగా నీటి మీటర్లను బిగించి, ప్రజల వద్ద నుంచి ముక్కుపిండి వసూలు చేయాలనే ఆలోచనతో విఎంసి పాలకవర్గం, అధికారులు ఉన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో కమర్షియల్ కనెక్షన్ల ద్వారా నీటి మీటర్లు పెట్టి, డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితిని నగర వాసులు గుర్తు చేస్తూనే ఉన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లు కన్నా నగర ప్రజల నుంచి వివిధ పన్నుల రూపాల్లో ప్రభుత్వాలకు వెళ్తున్న డబ్బు పది రెట్లు ఎక్కువని అంటున్నారు. వన్‌టౌన్ స్టేడియం దగ్గర నుంచి టిడ్కో గృహాల నిర్మాణం, ఎస్‌సి, ఎస్‌టి వాడలు, కొండ ప్రాంతాలు, మురికివాడల అభివృద్ధి, రహదారుల విస్తరణ, డ్రైనేజి, మంచినీటి సరఫరా మెరుగుదల, ఎస్‌టిపిల ఆధునీకరణ, కొత్త వాటి ఏర్పాటు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు ఏర్పాటు, అలాగే పెరిగిన ట్రాఫిక్ రద్దీకనుగుణంగా నగరంలో పలు ఫ్లైఓవర్ల నిర్మాణాలు అంచనాలకే పరిమితం అయిన పరిస్థితి... తదితర మౌలిక వనరుల కల్పన కోసం నిధులు లేక, అర్ధాంతరంగా ఆగిపోయినవి కొన్నైతే...శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలకే పరిమితం అయినవి మరికొన్ని, అలాగే వర్క్‌లు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు భారీ మొత్తంలోనే బిల్లులు జమ చేయని వైనం నేటికీ విఎంసిలో నెలకొన్నది. నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి పనికీ, ప్రతి అవసరానికి వివిధ పన్నుల రూపంలో ప్రజల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసే డబ్బులే శరణ్యం అన్నట్లుగా తయారయిందీ కానీ... ఎటువంటి షరతులు విధించకుండా కేంద్రం ప్రభుత్వం నిధులు, గ్రాంట్స్ మంజూరు చేస్తున్న పరిస్థితి కానీ, రాష్ట్రం వద్ద నిలిచిపోయిన నిధులను నగరానికి మంజూరు చేయాలని బిజెపి ప్రభుత్వం ఆదేశించిన దాఖలాలుగానీ లేదు. ఈ నేపథ్యంలో నగర ప్రజలకు కానీ, నగరానికి కానీ ఏమీ చేయని కేంద్రంలోని బిజెపితో టిడిపి పొత్తును స్థానిక ఆ పార్టీ నేతలే జీర్ణించుకోలేని పరిస్థితిలో ఉన్నారు.

ప్రచార వాహనాలకు అనుమతులు తీసుకోవాలి

ప్రజాశక్తి-విజయవాడ: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో సెంట్రల్ నియోజకవర్గం ఎన్నికల ప్రచారం కోసం ఆయా రాజకీయపార్టీల తరుపున పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన వాహనాలు, మైకులు, పార్టీ ఆఫీసులు, ఊరేగింపులు, బహిరంగ సభ, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఇతర అనుమతుల కోసం సంబంధిత నియోజకవర్గం స్థాయి రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. 80-విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ స్టేషన్లు 1 నుంచి 257 వరకు సంబంధించి విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని సిటిజన్ చార్టర్ కౌంటర్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో కౌంటర్ నుంచి దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని ఆయన పేర్కొన్నారు.

పటిష్ట సమన్వయానికి కమాండ్ కంట్రోల్ కేంద్రం

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని (ఐసీసీసీ) ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. సోమవారం కలెక్టర్ డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటాతో కలిసి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం కార్యకలాపాలను పరిశీలించారు. సీ-విజిల్, కాల్‌సెంటర్, ఎన్నికల వ్యయ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్), ఎంసీసీ, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల నిర్వహణ తదితర విభాగాల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా నోడల్ అధికారులు, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ స్క్వాడ్స్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ, స్వీప్ కార్యక్రమాలు తదితరాల మధ్య పటిష్ట సమన్వయ సాధనకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం కీలకమన్నారు. సీ విజిల్, నేషనల్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ సిస్టమ్ (ఎన్‌జీఆర్ఎస్), 1950 తదితర మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించడం ఎంత ముఖ్యమో సరైన విధంగా నివేదికల్లో పొందుపరిచి ఏరోజుకారోజు సమర్పించడం ముఖ్యమన్నారు. క్షేత్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు అనుసంధానమవుతూ నాణ్యమైన, కచ్చితమైన నివేదికలు రూపొందించాలన్నారు. విధుల నిర్వహణలో వేగంతో పాటు కచ్చితత్వం కూడా ముఖ్యమని కలెక్టర్ డిల్లీరావు స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



అధికారుల అలసత్వం


- గడువు ముగిసినా తొలగించని ప్రచార బోర్డులు



తొలగించని ఫెక్సీలు

ప్రజాశక్తి-పెడన : రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఎంతో ప్రతిష్టంగా అమలుపరచాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కేవలం కొన్నిచోట్ల ప్రకటనలకు పరిమితం అవుతున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని సాక్షాత్తు ఉన్నతాధికారులే ప్రతి సోమవారం నిర్వహించే స్పందన లాంటి కార్యక్రమాల్ని వాయిదా వేస్తూ ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. కానీ కింది స్థాయి అధికారులు మాత్రం ఎన్నికల కోడ్ ను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణ పరిధిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముఖద్వారం వద్ద ఫ్లెక్సీలను, హోర్డింగ్లలను అధికారులు తొలగించలేదు. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉందని ఉన్నతాధికారులు ప్రకటించిన సంగతి పాఠకులకు విధితమే. అయితే కేంద్ర ఎన్నికల సంఘం ఈ బ్యానర్లు, హోర్డింగులు, జెండాలను తొలగించేందుకు, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో పలు రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేయడానికి 48 గంటల సమయం ఆధికార, సిబ్బంది లకు కేటాయించింది. అంటే సోమ వారం మధ్యాహ్నానికి గడువు ముగిసింది. కానీ మున్సిపల్ అధికారులు వీటి వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

కమ్మిలికి జాతీయ సేవారత్న అవార్డు


జాతీయ ఉత్తమ సేవా రత్న పురస్కారాలు అందజేస్తున్న ఆర్కే కె.బి.ఆర్

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమం, కె.బి.ఆర్ సహకారంతో మూడవ వార్షికోత్సవం ఖమ్మం జిల్లా మధిర రెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సమాజంలో మంచి పనులు చేస్తూ సమాజ సేవకులకు జాతీయ ఉత్తమ సేవా రత్న పురస్కారాలు అందజేశారు. ఈ అవార్డు హనుమాన్ జంక్షన్ ప్రాంతవాసి నేహా మెడికల్ అధినేత కమ్మిలి వీర వెంకట సూర్యనారాయణమూర్తికి ప్రధానం చేశారు.ఆర్కే ఫౌండేషన్ అధినేత ఆర్కే , కె.బి.ఆర్ చేతులు మీదగా కమ్మిలి కి అవార్డు ప్రధాన అందజేశారు. సమాజ సేవ చేయటానికి మీకోసం మేమున్నాం అంటూ అనేక సేవా కార్యక్రమాలు స్నేహితులు సహాయంతో మూర్తి చేసి అభినందనలు అందుకున్నారు.ఎవరు ఆపదలో ఉన్న ఏ అవసరం వచ్చినా నేనున్నా అంటూ ముందుకు వచ్చే వ్యక్తి అలాగే తన సొంత నిధులతో దాదాపుగా 30 మంది విద్యార్థులకు కమ్మిలి సూర్యనారాయణ మూర్తి ఆర్థిక సహాయం చేశారు.

న్యాయ శాస్త్రంలో శశికిరణ్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - తెనాలి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం నుంచి పొన్నెకంటి సువ ర్చల శశికిరణ్ న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. 'సైబర్ క్రైమ్ లాస్ విత్ఇన్ ది క్రిమినల్ ఫ్రేమ్ వర్క్ ఇన్ ఇండియా, చేంజింగ్ పెరడైమ్స్ అండ్ పర్స్పెక్టివ్స్' అంశంపై డాక్టర్ కె.శ్రీగౌరి పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమ ర్పించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి డాక్టరేట్ ప్రధానం చేసేందుకు ఉత్తర్వులి చ్చినట్లు శశికిరణ్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూ రుకు చెందిన శశికిరణ్ జెజ గ్రూప్ సంస్థల ఛైర్పర్సన్‌గా ఉన్నారు. ఆమె పదో తరగతి వరకు కొలకలూరులో, అనంతరం గుంటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎల్సీఈ డిప్లమా పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యా లయం నుంచి ఎల్ఎల్బి పూర్తి చేసిన ఆమె, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్ఎం, శ్రీకృష్ణదే వరాయ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎ, అన్నామలై విశ్వవి ద్యాలయం నుంచి ఎంబీఏ, సెనేట్ ఆఫ్ సిరంపూర్ నుంచి బ్యాచిలర్ ఆఫ్ క్రిస్టియన్ స్టడీస్ పూర్తి చేశారు. తాజాగా ఎఎన్‌యు నుంచి పీహెచ్డీ పొందిన ఆమెను విశ్రాంత ఐఎఎస్ అధికారి పి.దయాచారి, ఎఎన్‌యు ప్రొఫెసర్ డాక్టర్ పిజె రత్నాకర్, డాక్టర్ వి.రామారావు అభినందించారు.

మంగళగిరి నుండి ఇండియా బ్లాక్ అభ్యర్థి పోటీ

ప్రజాశక్తి - మంగళగిరి : రావన్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మంగళగిరిలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి వి.వి జవహర్లాల్ అధ్యక్షత వహించగా చెంగయ్య మాట్లాడుతూ దేశాన్ని మతం పేరుతో చీల్చే బిజెపి కూటమిని ఓడించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే బిజెపితోపాటు దాని మిత్రపక్షాలను ఓడించాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో వైసిపి ప్రభుత్వం బిజెపి విధానాలకు మద్దతిస్తూ పాలన సాగిస్తోందని, ఆ పార్టీనీ ఓడించాలని ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మంగళగిరి అసెంబ్లీకి ఇండియా బ్లాక్ అభ్యర్థి పోటీ చేస్తారని, వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు ఎం.బాలాజీ, కె.ఏడుకొండలు, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

మైనార్టీ సమస్యల పరిష్కారానికి కృషి : కొల్లు


మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : తెలుగుదేశం, జనసేన, ఎన్డీఏ కూటమి అధికారలోకి రాగానే మైనార్టీల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. మచిలీపట్నం 34 డివిజన్ నూరి నగర్లో మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫిరోజ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ సందర్భంగా స్థానిక నూరినగర్ మజీద్ కమిటీ ఏర్పాటు చేసి స్థానిక సమస్యలు బరియల్ గ్రౌండ్ ఏర్పాటుకు సహరించాలని కోరారు. అలాగే మధరసా నిర్మాణం జరుగుతుంది దానికి కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ మైనారిటీల అభివద్ధికి టిడిపి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆడపిల్లల పెళ్లికి దులహన్ స్కీం, రంజాన్ తోఫా, విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఆర్థిక సహాయం, బందర్ లో 11 కోట్లతో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ఇలా అనేక కార్యక్రమాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖజి షేక్ హుస్సేన్, ఇమామ్ ఇర్ఫాన్, మజీద్ ప్రెసిడెంట్ ఇబ్రహీం, మజీద్ కమిటీ సభ్యులు నూర్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు సయీద్ ఖాజా, పట్టన పార్టీ అధ్యక్షులు ఇలియాస్ పాషా, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్ పాల్గొన్నారు.

బాపులపాడులో 'గడపగడపకూ శంఖారావం'



ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : వైసీపీ పాలనలో రాష్ట్ర అభివద్ధి కుంటుపడిందని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి అన్నారు. సోమవారం టీడీపీ టౌన్ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాపులపాడు గ్రామంలోని సాయిబాబా గుడి రోడ్డు ప్రాంతంలో గడపగడపకు శంఖారావం కార్యక్ర మంలో బాగంగా ఇంటింటికీ టీడీపీ-జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ,మండల అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షులు వడ్డి నాగేశ్వరావు,వీరమాచినేని సత్యప్రసాద్,పరుచూరి నవీన్, వడ్డిల్లి లక్ష్మి, యలమంచిలి వెంకటేశ్వరరావు, కడవకొల్లు నాగరాజు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక


వైసిపి కండువా కప్పుతున్న సామినేని ఉదయబాను

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : గత ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాలను ఓటు బ్యాంకుగా చూసారే తప్ప సామాజిక న్యాయం పాటించలేదని ప్రస్తుత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం లభించి సామాజిక న్యాయం జరుగుతుందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని ఉదయభాను స్వగహంలో వత్సవాయి గ్రామం బీసీ కాలనీకి చెందిన షేక్ యాసిన్, షేక్ సైదా లు ఉదయభాను చేస్తున్న అభివద్ధి కార్యక్రమాలు మెచ్చి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఉదయభాను పార్టీ కండువాళ్ళ కప్పి సాధారణంగా ఆహ్వానించారు. అలాగే పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు విలియంపేటకు చెందిన మారేపల్లి రాజు (క్రీస్తు రాజు), ఉప్పెల్లి యేసు ప్రతిపక్ష టిడిపిని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. చేరిన వారికి యువ నాయకులు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - మైలవరం : పోటీ ప్రపంచంలో విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని ఎల్‌బిఆర్‌సిఇ కళాశాల ప్రొఫెసర్ ఓ రమాదేవి పేర్కొన్నారు. స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగంలో స్పిరిట్ ఆఫ్ ఏ వన్ క్లబ్ డేని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, వి.సూర్యనారాయణ, విద్యార్థిని విద్యార్థులు తదగితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సింహాద్రి చంద్రశేఖర్

వైసిపి నాయకుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కోడూరు : రానున్న ఎన్నికల నేపథ్యంలో కోడూరు మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కోడూరు జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ ఇంటి వద్ద మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోడూరు మండలానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు పరిచయం చేశారు. అనంతరం సింహాద్రి చంద్రశేఖర్ కు కోడూరు మండలం వైఎస్ఆర్సిపి నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సింహాద్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలు పద్ధతులు నుంచి తాను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు.దివి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కొండవీటి వెంకటనారాయణరావు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రేఖారాణి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా ఈ రేఖా రాణి విధుల్లో చేరారు. ఈ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేసిన జి దుర్గా రమేష్ ఇటీవల గుండెపోటుతో మతి చెందారు. దీనితో ఇంటర్మీడియట్ బోర్డులో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న రేఖా రాణిని నియమించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ను యుడిసి వెంకటస్వామి, అధ్యాపకులు ఎస్ దిలీప్‌కుమార్, దుడ్డు కష్ణారావు, అన్నపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ప్రిన్సిపాల్ కు స్వాగతం పలికారు.



రేఖ రాణి కి స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు, సిబ్బంది

పొడవైన దోశతో గిన్నీస్ రికార్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎంటిఆర్ ఫుడ్స్ ఆధ్వర్యంలో అతి పొడవైన దోశతో గిన్నిస్ రికార్డును సాధించినట్లు సంస్థ ప్రతినిధి ఎం.రాజేష్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని ఎంటిఆర్ ఫుడ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలిపారు. ఎంటిఆర్ ఫుడ్స్ ప్రారంభించి వందేళ్లయిన సందర్భంగా ప్రత్యేకంగా వేడుకలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే కిచెన్ ఉత్పత్తులను అందించడంలో అగ్రభాగాన ఉందని తెలిపారు. ఎంటిఆర్ సిగ్నేచర్ రైస్ పిండి ద్వారా అతి పొడవైన దోశను తయారుచేయడానికి ఉపయోగించినట్లు తెలిపారు. ఎంటిఆర్ యొక్క క్యూసిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన నిపుణులు, వర్ధమాన పాకశాస్త్ర నిపుణులతో రికార్డు సాధించినట్లు తెలిపారు. 75 మంది చెఫ్‌లతో 123 అడుగుల దోశతో రికార్డు సాధించామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించే దిశగా ఎంటిఆర్ ఫుడ్స్ కృషి చేస్తుందన్నారు.

వ్యక్తికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : కన్న కూతుర్ని గర్భవతిని చేసిన కేసులో తండ్రికి జీవితకాల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ విజయవాడ పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి డా. ఎస్. రజిని తీర్పునిచ్చారు. విజయవాడ, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ఫిర్యాదికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఫిర్యాది భర్త దగ్గరలోని షామియానా షాప్‌లో పనిచేస్తున్నట్లు, పిల్లలు ముగ్గురూ దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో పెద్ద కుమార్తె (15 సంవత్సరాలు) బాలికకు వాంతులు అవుతూ నీరసంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో బాలికను 2023 జులై 2న హాస్పిటల్‌లో చూపించగా బాలిక గర్భిణిగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాలికను ఇంటికి తీసుకువెళ్లి అడుగ్గా ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో తండ్రి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ పలుమార్లు అత్యాచారం చేసినట్లు, ఈ విషయం ఎవ్వరికైనా చెప్తే చంపేస్తా అని బెదిరించినట్లు తల్లికి తెలిపింది. ఫిర్యాది తన భర్తను అడగ్గా గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. 2023 జులై 8న టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సదరు ఘటనపై అప్పటి పశ్చిమ ఎ.సి.పి. డాక్టర్ కె.హనుమంతరావు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఏ.సుబ్రహ్మణ్యం దర్యాప్తు చేసింది. జులై 10న నిందితుడైన బాలిక తండ్రిని అరెస్ట్ చేసి ఛార్జ్‌షీట్ నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం ఋజువైనందున ఈనెల 18న విజయవాడ పోస్కో కోర్ట్ జడ్జి డాక్టర్ ఎస్.రజిని నిందితునికి జైలు, రూ.40 వేలు జరిమానా విధించారు. బాలికకు రూ.5 లక్షలు నష్టపరిహారం వచ్చేలా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అధారిటీ వారిని ఆదేశించారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - వీరులపాడు, నందిగామ : మండల పరిధిలోని పెద్దాపురం గ్రామంలోని సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎసిపి రవి కిరణ్ ఆదేశాల మేరకు సిఐ చంద్రశేఖరరావు పర్యవేక్షణలో ఎస్ఐ మహాలక్ష్మణుడు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. మద్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా నగదును తరలిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద నిరంతర తనిఖీలు కోసం ఎస్ఎస్‌సి వింగ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



సిపిఎంను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు



మహిళలతో మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని ప్రజలందరూ సిపిఎంకు ఓటు వేసి అసెంబ్లీకి పంపిస్తే ప్రజల తరపున పోరాడి అభివృద్ధి చేసి చూపిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. మార్పు కోసం సిపిఎం పాదయాత్ర సోమవారం స్థానిక చెత్త ఫ్యాక్టరీ వెనుక జి-ప్లస్ త్రీ 60, 61 డివిజన్లో నిర్వహించారు. సిపిఎం ఇంటింటికీ ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ గతంలో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ కట్టడం కోసం కృషి చేసింది సిపిఎం మాత్రమే అని గుర్తు చేశారు. సింగ్‌నగర్‌లో డంపింగ్ యార్డ్‌తో ప్రజలు ఎన్నో సమస్యలతో ఎదుర్కొంటుంటే పోరాటాలు చేశామని, డిస్నీల్యాండ్‌లో 57 ఎకరాల ప్రభుత్వ భూమిని కబేళాలకు కార్పొరేటర్ వ్యవస్థకు కట్టబెట్టడం దారుణమని అన్నారు ప్రజలకు ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం మాత్రం కబేలాకు ఇవ్వటం దారుణమన్నారు. డిస్నీలాండ్ స్థలాన్ని ప్రజలకివ్వకపోతే పేద ప్రజలు ఆక్రమించుకుంటారని ఖాళీగా ఉన్న టెక్కో ఇల్లు పేద ప్రజలకు ఇవ్వాలని లేకపోతే వాటిని కూడా అర్హులైన ప్రజలు ఆక్రమించుకుంటారని దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలని డిమాండ్ చేశారు. జక్కంపూడి, సింగ్‌నగర్‌లో జి-ప్లస్ త్రీ అపార్ట్‌మెంట్‌లు నిరుపయోగంగా ఉన్నాయని, మందు బాబులకు బ్లేడ్ బ్యాచ్‌లకు నిలయంగా మారాయని, రాత్రి వేళలో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం జక్కంపూడిలో ఇల్లు ఇస్తామని రూ.25 వేల నుండి రూ.లక్ష వరకు వసూలు చేశారని టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ప్లాట్లు ఇవ్వకముందే బ్యాంకులో రుణాలిచ్చాయని వాటిని ఇప్పుడు కట్టమని డిమాండ్ చేస్తున్నాయని టిడిపి ప్రభుత్వం ఆనాడు ఎలక్షన్ కోసం ప్రజలను మోసం చేస్తే ఈనాడు వైసిపి ప్రభుత్వం పూర్తికాకుండానే తాళాలు ఇస్తామంటున్నారని అన్నారు. తాళాలిస్తే పూర్తి కాకుండా ఏం చేసుకుంటారని ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ప్లాట్లు చూపించకుండా పట్టాలిస్తున్నారని ఎలక్షన్ కోసం హడావుడి చేయటం తప్ప ప్లాట్లు ఎప్పుడో ఎక్కడ ఇస్తారో చెప్పడం లేదన్నారు. మోడీ బిజెపి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్న టిడిపి, జనసేనను ఓడించాలని సిపిఎంకు రోజురోజుకు మద్దతు పెరుగుతుందని మహిళల నుండి స్పందన ఎక్కువగా వస్తుందని సెంట్రల్ నియోజవర్గంలో సిపిఎం అభ్యర్థి గెలుస్తారని ప్రజలు తెలియజేస్తున్నారని ప్రజల తరఫున పోరాడే కమ్యూనిస్టులకు అండగా ఉంటామని స్థానికులు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ కార్యదర్శి బి.రమణారావు, అధ్యక్షులు కె.దుర్గారావు సిపిఎం నాయకులు ఎస్‌కె.పేరు నజీముద్దీన్ బాబూరావు సిహెచ్.శ్రీనివాస్, ఝాన్సీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి 'అవిక' యాప్ అద్భుత వరం

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఎంతోకొంత మానసిక ఒత్తిడి, సమస్యలు ఉంటున్నాయని అలాంటి వారందరికీ అవిక యాప్ గొప్ప వరమని రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. సూర్యారావుపేటలోని ఇండ్లాస్ హాస్పిటల్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అవిక యాప్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం కృష్ణబాబు మాట్లాడుతూ మానసిక సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా రూపొందించిన అవిక యాప్ దేశంలోనే మొట్టమొదటిగా భావిస్తున్నట్లు తెలిపారు. అవిక యాప్‌ను రూపొందించిన ఇండ్లాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ ఇండ్లను, అవిక టీమ్ సిఇఒ శిరీష పెయ్యేటి బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉన్నత విద్య శాఖ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ అవిక యాప్ కేవలం మానసిక సమస్యలున్నవారికే కాకుండా పరీక్షల ఒత్తిడి, ఏకాగ్రత లేకపోవడం, బెట్టింగ్, ప్రేమ వ్యవహారాలు, డ్రగ్స్‌కు అలవాటు పడడం, ఆత్మహత్య తలంపులు, నిద్రలేమి లాంటి సమస్యలున్న వారికి కూడా ఉపయోగపడే గొప్ప సాధనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీల విద్యార్థులకు కూడా అవిక యాప్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీని ఆధారం చేసుకుని రూపొందించిన అవిక యాప్ వైద్య రంగంలో ఒక విప్లవాత్మక అధ్యాయానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఇండ్లాస్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అవిక మెడికల్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ మాట్లాడుతూ, అవిక యాప్ ప్రత్యేకతలను వివరించారు. అవిక యాప్ వైద్యులకు, రోగులకు ఒక మంచి వారధిగా పనిచేస్తుందని, అన్నారు. అవిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శిరీష మాట్లాడుతూ పెరుగుతున్న మానసిక సమస్యలకు అధునాతన వైద్య చికిత్సలు అందిస్తున్న ఇండ్లాస్ హాస్పిటల్స్‌తో కలిసి వినూత్న విధానాలను అందించేందుకు తమ సంస్థ ఈ విధంగా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.

పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ విద్యార్థులు

స్పేస్ టెక్నాలజీ గ్యాలరీ సందర్శన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పటిష్టమైన సమగ్ర విద్యా వ్యవస్థను స్థాపించే లక్ష్యం కోసం ఏర్పాటు చేయబడిన నూతన జాతీయ విద్యా విధానం (2024) లక్ష్య సాధనలో భాగంగా విజయవాడ పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎ.రమాదేవి ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి 16 వరకు కె.భానుచందర్ పర్యవేక్షణలో ఇంజినీరింగ్ మొదట సంవత్సరం చదువుతున్న విద్యార్థులు బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం, హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ మరియు పరిశ్రమలను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా మ్యూజియంలో 2017లో ఏర్పాటు చేసిన ఇస్రో చైర్మన్ కరుణ్ కుమార్‌చే ఏర్పాటు చేసిన స్పేస్ టెక్నాలజీ గ్యాలరీని సందర్శించి విశ్వంలోని రహస్యాలను ఛేదించే క్రమంలో అంతరిక్ష వ్యోమగాముల ప్రయాణాలు వారికి అవసరమైన పరికరాలు, ఆహారం, మాంగల్యాన్ చంద్రయాన్ వన్ చంద్రయాన్- 3, ల్యాండ్ రోవర్ల పనితీరును, బెల్ హాలులో ఏర్పాటు చేసిన బేసిక్ ఎలక్ట్రానిక్స్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, టెలిమెడిస్ వర్చువల్ రియాలిటీ షో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇమేజ్ డిటెక్టర్, స్పేస్ త్రీడీ షో, డిఫెన్స్, మిలటరీలలో వాడే వివిధ రకాల సెన్సార్ డిటెక్టర్ల పనితీరు క్షుణ్ణంగా తెలుసుకున్నట్లు



కలా శాల సెక్రటరీ లక్ష్మణ్ స్వామి సోమవారం తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్తో ఏర్పాటు చేసిన సెన్సార్ స్క్రీన్ ముందు విద్యార్థులు నిలబడగానే వారు ధరించిన వస్తువుల పేర్లను, వాటి వివరాలను తెలియజేసే ప్రక్రియ ఎంతో అడ్వాన్స్ ఉందని అధ్యాపకులు తెలియజేశారని కళాశాల సెక్రటరీ పడుచూరి లక్ష్మణ స్వామి అన్నారు. భారతదేశ మొట్టమొదట అంతరిక్ష వ్యోమగామి రాకేష్ శర్మ ప్రతిమ ప్రక్కన విద్యార్థులు ఉత్సాహంగా ఫొటోలు దిగారని కళాశాల ప్రిన్సిపాల్ జె. లక్ష్మీ నారాయణ తెలిపారు. ఈ సందర్శనా కార్యక్రమాలలో విద్యార్థులతో 'పాటు విభాగ అధ్యాపకులు డాక్టర్ టి శాంతి శ్రీ, డాక్టర్ ఈ పి నరేష్, బి.అనిల్ కుమార్, వి. నాగమల్లిక, పూర్వ శర్మ వెంట ఉండి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ప్రైమ్‌లో 'షీ ఈజ్ అమెజాన్'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇన్స్పైర్ ఇన్ క్లూజన్ థీమ్ పేరుతో అమెజాన్ ప్రైమ్‌లో సరికొత్త కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి సోమనాథ్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహిళల్లో ఉన్నత వ్యక్తులను ఇక్కడ అమెజాన్ ప్రైమ్ ద్వారా పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆదర్శ ప్రాయమైన మహిళల గురుంచి తెలియచేస్తున్నాను అని తెలిపారు. ప్రముఖ క్రియేటివ్ డెవలప్మెంట్ ఎగ్జికటివ్ సాహిరా నాయర్ గురుంచి తెలియచేస్తున్నాను అని తెలిపారు.రానున్న కాలంలో మరింత మంది ఉన్నత స్థానం లో ఉన్నవారు గురుంచి తెలియచేస్తున్నాను అన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చాట్ల ఆదియ్య

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు చాట్ల ఆదియ్యను ఎన్టీఆర్ జిల్లా, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెడ్డిగూడెం మండల జడ్‌పిటిసి సభ్యులు పాలంకి విజయభాస్కర్ రెడ్డి, ఎంపిపి రామినేని దేవి ప్రవీణ్య వీరస్వామి నాయడు, వైస్ ఎంపిపి చాట్ల రాబర్ట్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు సిఫారసుతో నియమించారు.

వైసిపి ఎస్‌సి జిల్లా జాయింట్ సెక్రటరీగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వైసిపి ఎస్‌సి విభాగం ఎన్టీఆర్ జిల్లా జాయింట్ సెక్రటరీగా కొండపల్లికి చెందిన కుమ్మరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వైసిపి ఆవిర్భావం నుంచి శ్రీనివాసరావు పార్టీలో కొనసాగుతున్నారు. ఈయన సతీమణి కుమ్మరి నాగసుధ కొండపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. తనపై నమ్మకంతో ఎస్‌సి విభాగం జాయింట్ సెక్రటరీగా నియమించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.